క్లుప్తంగా


పంటలు నమోదు చేయించుకోండి

మంత్రాలయం రూరల్: మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పకుండా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ మహ్మద్‌ఖాద్రి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్బీకేను సందర్శించి రికార్డులను పరిశీలించి కియోస్క్ పనితీరు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన ఈ-కేవైసీ కుడా సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అగ్రిటెక్ ట్యాబ్‌లో ఎరువుల, విత్తనాల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ జీరా గణేష్, ఏఈఓ నరసింహులు, శ్రీధర్ వీఏఏలు ఉన్నారు.

ఉపాధి కూలీలకు అన్యాయం

ఆదోని రూరల్ : ఉపాధి హామీ చట్టానికి నిధుల కేటాయింపును తగ్గించి కేంద్ర ప్రభుత్వం కూలీలకు తీవ్ర అన్యాయం చేసిందని, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని ఇస్వీ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. గత సంవత్సరం రూ.90 వేల కోట్లు ఖర్చు చేస్తే ఈ సంవత్సరం బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించి రూ.30 వేల కోట్లుకోత పెట్టిందని విమర్శించారు. ఇప్పటికే పది వారాలుగా ఉపాధి కూలీలు చేసిన పనికి వేతనాలు ఇవ్వడంలేదని, రెండు నెలలుగా కూలీలకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇందుకోసం ఈనెల 7వ తేదీన ఆదోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.

టూరిస్టు పోలీస్ స్టేషన్ ఏర్పాటు



స్టేషన్‌ను పరిశీలించిన ఆదోని డీఎస్పీ

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం వద్ద నూతనంగా ఏపీ టూరిస్టు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీసులకు ఏర్పాటు చేసిన భవనాన్ని పరిశీలించారు. త్వరలోనే ఉన్నతాధికారుల చేతుల మీదుగా స్టేషన్‌ను ప్రారంభిస్తామని డీఎస్పీ తెలిపారు. ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్‌తో పాటు 12 మంది సిబ్బందిని కేటాయిస్తామని చెప్పారు. శ్రీ మఠం భద్రత, భక్తుల సౌకర్యార్థం పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఉన్నారు.

12లోపు ఈ- క్రాప్ నమోదు చేయించుకోండి

కౌతాళం: రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్ కింద పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 12వ తేదీలోపు పంటలను నమోదు చేయించుకోవాలని చెప్పారు. రబీ సీజన్‌లో 4,490 ఎకరాల్లో పంటలు సాగుచేశారని, అత్యధికంగా వరి పైరు సాగుచేశారని ఇప్పటి వరకు 3500 ఎకరాల్లో పంటల నమోదు పూర్తి చేశారని, మిగిలిన వెయ్యి ఎకరాల్లో నమోదు చేయాల్సి ఉందన్నారు.

ఆర్థిక సాయం

కౌతాళం: కుంబళనూరు క్యాంపులో మదిర ముత్తమ్మ మృతి చెందడంతో మట్టి ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు అనిల్, శేషారావు శనివారం రూ.5వేలు అందజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు నగదు అందజేసి వారు మాట్లాడుతూ కుటుంబానికి ఎమ్మెల్యే అండగా ఉంటారని చెప్పారు.శివకుమార్, వెంకటచక్రవర్తి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కౌతాళం: అకాల వర్షాల వల్ల నష్టపోయిన మిరప రైతుల్ని ఆదుకోవాలని, ఉపాధి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిరప పంట సాగుచేసిన రైతులు పూర్తిగా దెబ్బతిన్నారని, పెట్టుబడి కూడా రాలేకపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అలాగే 8వారాల పాటు చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న,ఉలిగయ్య, వెంకటేశ్, రామలింగ, వీరేష్, వలి ఉన్నారు.

ఘనంగా జ్యోతి ఉత్సవాలు

పెద్దకడబూరు : మండల కేంద్రంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి తెల్లవారిజాము నుంచి ఆలయ అర్చకులు మహా గణపతి పూజ, కుంకుమార్చన, బిల్వార్చన, పుష్పార్చన, శతనామావళి, ఆకుపూజతో పాటు మహా మంగళ హారతులు చేపట్టారు. అనంతరం తొగట వీరక్షత్రీయ కుల బాంధవులతో పాటు గ్రామస్తులు పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్థానిక మల్లికార్జున స్వామి ఆలయం నుంచి అమ్మవారి అభిషేకం కోసం తీసుకొచ్చిన తుంగభద్ర నదీ జలాన్ని జ్యోతులలో ఉంచి మంగళ వాయిద్యాల నడుమ భజనలు, ఆడపడుచులు కళశాలతో స్వాగతం పలుకుతుండగా, పురు వీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం తుంగా జలంతో అమ్మవారిని అభిషేకించారు. ఆదివారం జరిగే జ్యోతి ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ అధ్యక్షుడు మఠం రామాంజినేయులు తెలిపారు.

మెప్పించే అక్షరం


దస్తూరిపై సాధన చేస్తున్న విద్యార్థులు

జవాబులను అందంగా రాస్తే

మూల్యాంకనం చేసే వారి మనస్సును గెలిచి అధిక మార్కులు సాధించవచ్చు. పరీక్షల్లో ప్రశ్నలకు అందరూ జవాబులు రాస్తారు.. అయితే వారిలో దస్తూరి బాగుండే వారికి అధిక మార్కులు లభిస్తాయి. దీన్ని గ్రహించి విద్యార్థులు చేతిరాతను మెరుగు పర్చుకోవాలని ఉపాధ్యాయులు, నిపుణులు సూచిస్తున్నారు. త్వరలో పది, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఇందులో సమాధానాలతో పాటు రాత తీరు కూడా మార్కులను శాసిస్తుందని, గుండ్రంగా రాయడంపై టీచర్లు అభ్యాసకులతో రోజూ సాధన చేయిస్తున్నారు.

- మార్కులు పెంచనున్న అందమైన చేతి రాత
- విద్యార్థులు దస్తూరిపై సాధన చేయాలంటున్న నిపుణులు
- పది, ఇంటర్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యాసకులు

ఆదోని అర్బన్ : అక్షరాలు అందంగా, గుండ్రంగా ఉన్న రాతను చూస్తే ఎవరైనా ముచ్చటపడతారు. చేతిరాత అందంగా ఉన్నప్పుడే విద్యార్థులు మంచి మార్కులను పొందే వీలుంటుంది. మార్చిలో ఇంటర్, ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో చేతిరాతపై ఇప్పటి నుంచే విద్యార్థులతో రోజూ గంటపాటు ఉపాధ్యాయులు సాధన చేయిస్తున్నారు. ఆదోని డివిజన్ పరిధిలో 15,142 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఆదోని నియోజకవర్గంలోని 46 ప్రభుత్వ పాఠశాలల్లో 2,553 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో 29 ప్రైవేట్ పాఠశాలల్లో 1,701 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

మార్కులను శాసించనున్న రాత..

మార్చి 15 నుంచి ఇంటర్, ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అత్యుత్తమ మార్కులు సాధించి మంచి మార్కులు, గ్రేడింగ్ పాయింట్లతో ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో అనేక మంది విద్యార్థులు ప్రణాళికను సైతం రూపొందించుకుని చదవడం ప్రారంభించారు. అయితే ఏడాది పాటు చదివిన విషయాలను జవాబు పత్రంపై రాసే విధానం వల్ల కూడా మార్కులు, గ్రేడింగ్ పాయింట్లు ఆధారపడి ఉంటాయి. అయితే ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించే విద్యార్థులు తక్కువ మంది ఉంటారు. పరీక్షల్లో ప్రశ్నలకు సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో, చేతిరాత కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గుర్తించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చేతిరాత బాగుంటే మూల్యాంకనం చేసేవారికి సులువుగా అర్థమవుతుంది. ఫలితంగా మంచి మార్కులు వేస్తారు. దస్తూరి బాగా లేకపోతే సమాధానం అర్థంగాక ఒక మార్కు, అర మార్కు తగ్గే అవకాశం ఉంటుంది. ఈ విధానం గ్రేడింగ్‌పై ఫలితం చూపుతుంది. కావున విద్యార్థులు చేతిరాతపై దృష్టి సారించాల్సిన అవసరముంది. ఇందుకోసం రోజూ గంటపాటు ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ప్రత్యేకంగా చేతిరాతపై తర్ఫీదునిస్తున్నారు.

సమయం కేటాయించాలి



చక్కటి చేతిరాతతో జవాబులు రాస్తే అధిక మార్కులు సాధించవచ్చు. పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు అక్షరాలను అందంగా రాసేందుకు సమయాన్ని కేటాయించుకోవాలి. చాలామంది తొలి ప్రశ్నకు గుండ్రటి అక్షరాలతో సమాధానం రాస్తారు. తర్వాత సమయం అయిపోతుందనే ఆత్రుతో వేగంగా రాస్తారు. ఈ ప్రభావం మార్కులపై పడుతుంది. అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే తప్పనిసరిగా సాధన చేయాల్సిందే.

– లోక్యానాయక్, ఉపాధ్యాయుడు, మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ పాఠశాల, ఆదోని

ఇలా రాయాలి..

- జవాబు పత్రాల్లో సమాధానాలను స్పష్టంగా రాయాలి.
- పేపర్‌కు నాలుగువైపులా బార్డర్ వేస్తే అందంగా ఉంటుంది.
- సమాధానంలో అక్షరాలన్నీ ఒకేలా ఉండాలి.
- అక్షరాలు మరీ పెద్దవి, చిన్నవిగా ఉండకూడదు.
- పేపర్ అంతా ఒకే స్థాయిలో అక్షరాలు ఉండాలి.
- ఒకలైనుకు మరొక లైనుకు సెం.మీ. దూరం ఉడాలి.
- పదాల మధ్య సమ దూరం పాటించాలి.
- వాఖ్యాలు వరుస క్రమంలో ఉండాలి.

రోజూ అరగంట సాధన చేయాలి



రోజూ పాఠశాలలో అరగంట చేతిరాతపైనే క్లాసు తీసుకుంటున్నాం. టెస్టు బుక్ ఇచ్చి నోట్ పుస్తకాల్లో చూసి రాయిస్తూ సాధన చేయిస్తున్నాం. ఏ అక్షరం ఎలా రాయాలి, ఎలా రాస్తే బాగుంటుందనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే ఎస్ఏ రైటింగ్‌పై తర్ఫీదునిస్తున్నాం. ఫుల్‌స్టాప్‌లు ఎక్కడ పెట్టాలి, కామాలు ఎక్కడ వాడాలనే విషయాలను కూడా తెలియజేస్తున్నాం.

– ప్రహ్లాద్, తెలుగు ఉపాధ్యాయుడు, మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ పాఠశాల, ఆదోని.

సాధనతోనే సాధ్యం



రోజూ విద్యార్థులు ఇంట్లో చేతిరాతపై సాధన చేయాలి. ఇందుకు తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలి. దీంతో మార్కులు కూడా బాగా వస్తాయి. పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు అక్షరాలను అందంగా రాసేందుకు ప్రాక్టీస్ చేయాలి. పరీక్ష సమయంలో ఆత్రుత పడకుండా నెమ్మదిగా, సమయాన్ని వినియోగించుకుంటూ చక్కగా రాయాలి. గ్రేడింగ్‌తో పాటు మార్కులు కూడా బాగా వస్తాయి.

– ఇందిర ప్రియాంక, ఉపాధ్యాయిని, మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆర్ఆర్ లేబర్ కాలనీ, ఆదోని

పల్లెల్లో ప్రశాంతంగా జీవించండి


104 బసాపురంలో మాట్లాడుతున్న ఆదోని తాలూకా సీఐ మహేశ్వర్‌రెడ్డి

ఆదోని రూరల్ : పల్లెల్లో ప్రశాంతంగా జీవించాలని తాలూకా సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని 104 బసాపురం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పోలీసు చట్టాలపై అవగాహన కల్పించారు. ఫ్యాక్షన్ గొడవలు, వ్యక్తిగత మనస్పర్థల వల్ల గొడవలకు పాల్పడి పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగొద్దన్నారు. వాటి వల్ల ఆర్థికంగా నష్టపోవడమే గాకుండా మానసికంగా ఇబ్బందులపాలవుతారన్నారు. అలాగే సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, దొంగతనాలు, దోపిడీలు, మట్కా, పేకాట వంటి వాటి వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. హెడ్‌కానిస్టేబుల్ బషీర్‌అహ్మద్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని బూదూరు గ్రామంలో ఎస్ఐ వేణుగోపాల్‌రాజుతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రయాణ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మహిళ రక్షణకు దిశ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

పంట నమోదు పరిశీలన

పెద్దకడబూరు : మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో రైతుభరోసా కేంద్ర సిబ్బంది చేపట్టిన పంట నమోదును మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

బైపాస్ రోడ్డు త్వరగా పూర్తిచేయండి


అధికారుల సమీక్షలో పాల్గొన్న ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : ఆదోని-ఎమ్మిగనూరు, ఆదోని-ఆలూరు హైవే రోడ్డును కలిపేందుకు ఏర్పాటు చేయనున్న నేషనల్ హైవే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేకుమార్, నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో బైపాస్ రోడ్డుకు భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించే విషయం, రోడ్డు వెడల్పు తదితర అంశాల గురించి చర్చించారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని అధికారులను కోరగా, కొందరు ప్రభుత్వ ధరకు భూములివ్వడానికి ఆసక్తి చూపకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయని, అంతేగాకుండా ఓ వ్యక్తి రోడ్డుకు వెళ్లే దారిలోనే ఇళ్ల నిర్మాణం చేసుకున్నాడని, ఆయన కోర్టుకు వెళ్లడంతో పనులు నెమ్మదించాయని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు పనులను కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది కాబట్టి ప్రజలకు సరైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటుందని, ఎలాంటి పనులు చేపట్టినా ప్రభుత్వ ఆదేశాలనుసారం స్థలాలు ఇవ్వాల్సిందేనని చెప్పారు. ఈ విషయంపై తన పీఏ నరసింహమూర్తిని కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ వెంట ఢిల్లీకి పంపించి అక్కడ కేంద్ర మంత్రితో చర్చించి పరిహారం తీసుకొచ్చేలా చేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులు మంజూరు


సుళేకేరిలో కల్వర్టు, డ్రైనేజీ నిర్మిస్తున్న దృశ్యం

కౌతాళం: గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారం నిమిత్తం వివిధ అభివృద్ధి పనులు మంజూరయ్యాయని పంచాయితీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తోవి గ్రామానికి రూ.20లక్షలతో డ్రైనేజీ నిర్మాణంతో పాటు సిమెంటు రోడ్డు, మల్లనహట్టి గ్రామంలో రూ.5లక్షలతో డ్రైనేజీ, చిరుతపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో సిమెంటు రోడ్డు పనులు మంజూరయ్యాయని చెప్పారు. కాత్రికి గ్రామానికి రూ. 20 లక్షలు మంజూరు కాగా ఇందులో విద్యుత్ పరికరకాలకు రూ.3 లక్షలు పోగా రూ. 17లక్షలతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ పనులు చేపడుతామన్నారు. సుళేకేరి గ్రామంలో ఇప్పటికే రూ.10 లక్షలతో సీసీ కల్వర్టు నిర్మించామని పేర్కొన్నారు. బంటకుంట గ్రామంలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు పనులు చేపడుతామని వివరించారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత


మల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దస్తగిరిమ్మ

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలో నివాసముంటున్న బలిజ మల్లమ్మకు కొద్ది రోజుల క్రితం కిందపడి కాలు విరిగింది. దీంతో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి నారయణ మున్సిపాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న సంబంధిత వలంటీర్ దస్తగిరిమ్మ శనివారం హైదరాబాద్‌కు వెళ్లి ఆమెకు వృద్ధాప్య పింఛన్ మొత్తం రూ, 2,750 అందజేసింది. వలంటీర్‌ను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురంరెడ్డి సోదరులు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అభినందించారు.

ఆదోని టౌన్ : పట్టణంలోని 33వ వార్డు ఖాజీపుర వీధిలో నివాసముంటున్న భీమలింగప్ప గత నెల 30న అనారోగ్యంతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోనున్న సిటీసీరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్లు తాహెర్, నాగేంద్ర శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్లి శనివారం భీమలింగప్పకు పింఛన్ మొత్తం రూ.2,750 అందజేశారు. వారికి భీమలింగప్ప కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరుచుకోవాలి


ఉపన్యసిస్తున్న అభినవ సిద్ధరూఢ మహాస్వామి

కోసిగి: ప్రతి ఒక్కరూ ఆధ్యాతికతను అలవరుచుకోవాలని సద్గురు ఆరూఢజ్యోతి శ్రీషణ్ముఖరూఢ మఠం పీఠాధిపతులు అభినవ సిద్ధరూఢ మహాస్వామి, కరిబసవ రాజేంద్ర మహాస్వామి, మాతాశ్రీ గురుచరణానందగిరి సూచించారు. శనివారం స్థానిక రైల్వే గేటు సమీపంలో కొలువైన శ్రీ సిద్ధరూఢ స్వామి సప్తమి వార్షికోత్సవ వేడుకలు రెండో రోజు కొనసాగాయి. ముందుగా స్వామి వారికి వేకువ జాము నుంచి ఫల,పుష్పాలు సమర్పించి విశేష పూజలు చేపట్టారు. ఉదయ 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, సాయంకాలం 7 నుంచి రాత్రి 10గంటల వరకు సిద్ధరూఢ స్వామి విశిష్టతను భక్తులకు వివరించారు. ఉపన్యాసానికి ముఖ్య అతిథులుగా కర్ణాటక రాష్ట్రం బీజాపురం శ్రీషణ్ముఖరూఢ మఠం పీఠాధిపతులు శ్రీ అభినవ సిద్ధరూఢ మహాస్వామి, ఉరవకొండ శ్రీగవిమఠ సంస్థాన పీఠాధిపతులు శ్రీకరిబసవరాజేంద్ర మహాస్వామి హాజరై స్వామి వారిని దర్శించుకుని భక్తులకు సందేశం వినిపించారు. కాగా ఉత్సవాల్లో భాగంగా నేడు స్వామి మహారథోత్సవం, పల్లకోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ పథకాలు అందేలా చూడండి
- పార్టీలు, కుల,మతాలకు అతీతంగా వర్తింపజేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి
- బసలదొడ్డిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు శిక్షణ


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి

పెద్దకడబూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బసలదొడ్డి గ్రామంలోని పైరయ్యస్వామి ఆలయ కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై శనివారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అమలవుతున్న పథకాలు లబ్ధిదారులకు ఏవిధంగా అందుతున్నాయి, అర్హులందరికీ అందుతున్నాయా లేదా అనే విషయాన్ని వారి పరిధిలో ప్రతి ఒక్కరూ పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఇకపై ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ప్రతి పథకం వలంటీర్లు గృహ సారథుల సమక్షంలో లబ్ధిదారులకు అందజేయాలని తెలిపారు. ఒకవేళ అర్హులకు సంక్షేమ ఫలాలు అందకపోతే లోపాలను గుర్తించి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలు ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని గుర్తించి మండల స్థాయి నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కలిసికట్టుగా ప్రజల సంక్షేమం కోసం కృషి చేసి రాబోయే ఎన్నికల్లో పార్టీని అధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నతుంబళం సింగిల్‌విండో అధ్యక్షుడు రవీంద్ర, వైస్ ఎంపీపీ పరమేష్‌గౌడ్, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, మాజీ ఎంపీపీ రఘురాముడు, పెద్దకడబూరు సర్పంచ్ రామాంజనేయులు, నాయకులు రవిచంద్రరెడ్డి, శివరెడ్డి, లంకారెడ్డి, శివరాముడు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న దృశ్యం

కోసిగి: మండల కేంద్రంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి యూనిఫాం పంపిణీ చేశారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మేజర్ పంచాయతీ సర్పంచ్ కుమారి అయ్యమ్మ ఆధ్వర్యంలో 44 మంది కార్మికులకు దుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 8మంది మహిళల కార్మికులకు చీరలు, 36 మంది కార్మికులు ప్యాంట్లు, షర్ట్స్, టవళ్లు అందజేశామని చెప్పారు. ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ బెట్టన గౌడ, నాడుగేని నాగరాజు, మాణిక్యరాజు, వక్రాని వెంకటేశ్వర్లు, హొళగుంద కోసిగయ్య, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు మెంబర్లు బుల్లి నరసింహులు, మల్లికార్జున గౌడ, కాంట్రాక్టర్ బసిరెడ్డి, దొడ్డి నరసన్న, కాల్వ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి


కాంపోస్టు యార్డు ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్ : సిరుగుప్ప చెక్‌పోస్టు సమీపంలోని కాంపోస్టుయార్డు వద్ద రక్షణగోడ నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతగా జరగాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే 37వ వార్డు సచివాలయంను తనిఖీ చేసి ఉద్యోగులతో చర్చించారు. ఆస్తి, నీటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలని, మార్చి ఆఖరు నాటికి పన్నుల వసూళ్లు వందశాతం పూర్తి కావాలని ఆదేశించారు. అలాగే యూజర్ చార్జీలు వసూలు చేయాలన్నారు. 34వ వార్డు సచివాలయంలో ఉద్యోగుల హాజరు పట్టిక, రికార్డులను తనిఖీ చేశారు. ఎంఐజీ కాలనీలోని మున్సిపల్ లేఅవుట్ ప్రాంతంలో పెరిగిపోయిన ముళ్ల పొదల తొలగింపు పనులను పరిశీలించి, మున్సిపల్ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పీస్ పార్కు వద్ద ఉన్న పంప్‌హౌస్ వద్ద తాగునీటి సరఫరాకు సంబంధించిన లైన్‌మెన్‌లు, సిబ్బందితో నీటి సరఫరాపై సమీక్షించారు. మరో నెలరోజుల్లో వేసవి రాబోతోందని, ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. పైపులైన్ల లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టాలని, తాగునీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు.

బాల్య వివాహాల నిర్మూలనను బాధ్యతగా తీసుకోవాలి


మాట్లాడుతున్న ఆదోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.జె.సుధ

ఆదోని రూరల్ : బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.జె.సుధ తెలిపారు. శనివారం పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా మతాల పెద్దలు, అధికారులు పాల్గొన్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహ చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఆయా మతపెద్దలు వివాహాలపై తల్లిదండ్రులు, వధూవరులకు అవగాహన కల్పించాలని కోరారు. జడ్జి శ్రీకాంత్, సీనియర్ న్యాయవాదులు శివకుమార్‌స్వామి, న్యాయవాదులు లోకేష్‌కుమార్, తాలూకా సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్ఐ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు


కౌతాళంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, అగసలదిన్నె ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారం కావడంతో భక్తులు వందలాదిగా తరలివచ్చి దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు వాయుపుత్రుడుకి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాములకు విశేష పూజలు చేసి ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి ఊరేగించారు.